క్లుప్తంగా

ఒకటిన ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి శ్రీరమణా సేవాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వచ్చే నెల ఒకటిన ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి స్వామి రామానంద తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేస్తారని చెప్పారు. అతి తక్కువ ఖర్చుతో అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. రాచపల్లి, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుపై ఏకాగ్రత ఉండాలి


ఏలేశ్వరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత ఉండాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువులో పాటు వివిధ పోటీల్లో పాల్గొని తమ సత్తా నిరూపించుకోవాలన్నారు. అనంతరం కథలు చదవడం, రాయడం, పద్య పఠనం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


శంఖవరంలో బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శంఖవరం: గ్రామానికి చెందిన పులి చిన్నబ్బాయి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి స్థానిక జెడ్పీ హైస్కూల్ 1996–97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.8,500 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నిత్యావసర సరకులు, దుస్తులు అందించారు. బ్యాచ్‌లో ఎవరికి, ఏ అవసరం వచ్చినా సహకరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శశికుమార్, గుణవంతుడు, కాంతరాజు, సోమేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు శక్తి యాప్


తుని రైల్వేస్టేషన్‌లో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ రైల్వే పోలీసులు

తుని: రైళ్లలో జరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి యాప్‌ను ప్రజలు వినియోగించుకోవాలని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు కోరారు. బుధవారం విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు తుని, అన్నవరం, ఎలమంచిలి రైల్వేస్టేషన్ల పరిధిలో అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించామని శ్రీనివాసరావు తెలిపారు. స్మార్ట్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 139 నంబర్లకు ఫోన్ చేయడం, ఎస్‌వోఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ ఆయుధంలా పని చేస్తుందన్నారు. మహిళలు, విద్యార్థులు తమ ఫోన్లలో దీనిని డౌన్‌లోడ్ చేసి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆధార్ లేని చిన్నారుల గుర్తింపు


మల్లేపల్లిలో చిన్నారుల వివరాలు సేకరిస్తున్న న్యాయవాదులు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి, జెడ్.రాగంపేట గ్రామాలకు చెందిన ఆధార్ నమోదు కాని చిన్నారులను గుర్తించినట్టు న్యాయవాదులు తెలిపారు. సాతి అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం వీరిని గుర్తించామన్నారు. వీరికి త్వరలో ఆధార్ కార్డు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాంబాబు, దుర్గారావు, గణేష్, సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్త మంగారత్నం, పారా లీగల్ వలంటీర్లు అప్పలకొండ, మూర్తి, లక్ష్మి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు సమరంలో దుక్కుతూ..

- ముమ్మరంగా వేసవి దుక్కులు
- భూమికి శ్రేయస్కరమంటున్న వ్యవసాయాధికారులు
- భూసారం వృద్ధి, తెగుళ్ల నివారణ
- అధిక దిగుబడులకు ఆస్కారం


ఒమ్మంగిలో వేసవి దుక్కులో నిమగ్నమైన రైతు

ప్రత్తిపాడు రూరల్: భూమి సారవంతంగా ఉంటేనే దిగుబడులు బాగుంటాయి. వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన రైతులు వేసవిలో ఆయా పొలాల్లో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునేలా చేయాలి. రైతులు భూసారాన్ని వృద్ధి చేసుకునే చర్యలపై దృష్టి సారించడం లేదు. వేసవిలో పొలాల్లో దుక్కులు చేపట్టడం వల్ల బహుళ ప్రయోజనాలున్న విషయాన్ని విస్మరిస్తున్నారు. వ్యవసాయంపై మక్కువ, ఆసక్తి ఉన్న రైతులు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

అనువుగా పొలాలు

ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేసే పొలాల్లో వేసవి దుక్కులు చేయడం ఎంతో లాభదాయకం. రైతులు వేసవి దుక్కులు చాలా వరకు మానేశారు. ప్రస్తుతం మండలంలోని పోతులూరు, ధర్మవరం, వాకపల్లి, శరభవరం, గజ్జనపూడి, ఒమ్మంగి, చింతలూరు, ఉత్తరకంచి, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి. మండలంలో 19,704 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇందులో వరి 8,559 ఎకరాలు, అరటి 813, సరుగుడు 1,771, మామిడి 1,430, పామాయిల్ 1,650, పత్తి 531, ఇతర పంటలు 4,945 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నటుల్ వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలిలా..

వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల గడ్డి నశించి పోవడంతో పాటు, వరిమొళ్లు కుళ్లి భూమిలో కలిసి ఎరువుగా మారుతాయి. భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని, తదుపరి సాగు చేసే పంటకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి. పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది. తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఎండలకు చనిపోడానికి అవకాశాలు ఉంటాయి. తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు. రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లి భూసారాన్ని పెంపొందించుకోవచ్చు.

> **దుక్కులతో బహుళ ప్రయోజనాలు**
>
> 
>
> పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటి సారం తగ్గుతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాలలో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ తరువాత అపరాలు సాగు చేసే భూముల్లో కాకుండా, ఖాళీ పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం వల్ల చెడు పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. ఈ విధంగా చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి.
>
> – వై.గంగాధర్, మండల వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు

ఘనంగా పాదుకా ప్రతిష్ఠ మహోత్సవం


ఆలయంలో ప్రతిష్ఠించిన పాదుకలు

అన్నవరం: సాలగ్రామశిల దత్త పాదుకా ప్రతిష్ఠ మహోత్సవాన్ని స్థానిక గొడేవారి తోటలోని దత్తాత్రేయ స్వామివారి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధనం, రుత్విక్ వరుణలు, మంటపారాధన తదితర కార్యక్రమాలతో మంగళవారం ఉదయం ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పాదుకలకు మూలమంత్ర జపాలు, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రాతః కాలార్చన నిర్వహించి, 8–25 గంటలకు గర్భాలయంలో వేదమంత్రాల నడుమ పాదుకలు ప్రతిష్ఠించి, కళాన్యాసం అనంతరం పాదుకలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. తరువాత హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీసత్య దత్త వైదిక సమాఖ్య ఆధ్వర్యంలో మహేంద్రవాడ జగదీష్‌శర్మ పర్యవేక్షణలో పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయమే లక్ష్యంగా శ్రమించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


ఏలేశ్వరంలో పార్టీ నాయకులతో ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం పార్టీ నాయకులను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టత శ్రేణులు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా.. ఇప్పటివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సూరాబత్తుల కొండలరావును ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల విజయ్‌కుమార్, శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్, గుమ్ములూరి వెంకటరమణ, కాలారి సత్తిబాబు, ముద్రగడ వీరేంద్ర, వాడపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు

- లబ్ధిదారుల అరుపులు, కేకలతో గందరగోళం
- పారదర్శకంగా కేటాయించామన్న తహసీల్దార్


కుమ్మరిలోవ నిర్వాసితులకు లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న రెవెన్యూ అధికారులు

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులకు అరుపులు, కేకల మధ్య ఇళ్ల స్థలాలను లాటరీ పద్ధతిలో రెవెన్యూ అధికారులు కేటాయించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి అనువుగా కుమ్మరిలోవ కాలనీ ఇళ్లను తొలగిస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు బుధవారం తుని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. మొత్తం 472 మంది లబ్ధిదారులకు గాను 272 మందికి తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ముందుగా ఎస్సీ, ఎస్టీలకు, బీసీలను ఎంపిక చేశారు. ఇతరులకు కేటాయిస్తుండగా కొందరు అడ్డుతగిలి.. ముందు నుంచీ కోరుతున్నట్టుగా కుమ్మరిలోవ సమీపంలో సేకరించిన భూములనే స్థలాలకు కేటాయించాలని, చేపూరులో కావాలని అడిగిన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు అన్నదమ్ములు ఉన్నప్పుడు ఒకే ప్రాంతంలో స్థలాలు కేటాయించాలన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ, పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని, కేటాయింపుల తర్వాత అభ్యంతరాలుంటే పెద్దాపురం ఆర్డీఓకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అందుకు కొంతమంది అంగీకరించలేదు. అయినప్పటికీ లాటరీ పద్ధతిలో స్థలాలు కేటాయించడం, ఉమ్మడి కుటుంబాల్లో నిర్వాసితులకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో స్థలాల కేటాయింపులతో లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితి విషమించకుండా పోలీసులు, సిబ్బంది జోక్యం చేసుకుని వారిని అదుపు చేశారు. నిర్వాసితులందరికీ ఒకేచోట భూమి లేదని, నిర్వాసితులతో ఉన్నతాధికారులు మాట్లాడిన తర్వాతే రెండు లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు తహసీల్దార్ తెలిపారు. పట్టణ సీఐ గీతారామకృష్ణ, గ్రామ నాయకులు జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారిని దర్శించుకుంటున్న తోట నరసింహం, రాంజీ


స్వామివారి సన్నిధిలో ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: ఎస్.తిమ్మాపురంలోని ప్రఫుల్లాన్నపూర్ణా సమేత భద్రాద్రి రామలింగేశ్వర క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, తోట వాణి, యువ నాయకుడు తోట రాంజీ, శ్రీనిధి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యుడు బండారు వరప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓలేటి రాజేశ్వరరావు, ఆలయ నిర్మాణకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ఉచ్చులో జూదరులు, మందుబాబులు

గోకవరం: నేరగాళ్లను పట్టుకునేందుకు గోకవరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నారు. గాల్లో ఎగరేసిన డ్రోన్ కెమెరా సాయంతో జూదరులను, మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు, మండలంలోని కొత్తపల్లి గ్రామంలో డ్రోన్ కెమెరా ఎగురవేశారు. ఓ ప్రదేశంలో బొమ్మబొరుసు ఆడుతున్న పలువురిని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పలువురిని గుర్తించి, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. డ్రోన్ కెమెరా సాయంతో మండలంలో నిరంతర నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు, గ్రామానికి చెందిన కాకర్ల వంశీకృష్ణ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పోలీసులు దాడి చేసి, అతని వద్ద నుంచి 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా సారా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా, కోడిపందేలు, పేకాట ఆడుతున్నా తమకు సమాచారం అందజేయాలని కోరారు.

మార్కెట్ యార్డులో పారిశుధ్యం అధ్వానం


తుని మార్కెట్ యార్డు వద్ద గుమిగూడిన పశువులు

తుని: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు బజారులో పారిశుధ్యం అధ్వానంగా మారంది. వర్షాలు కురవడంతో నీరు నిలిచిపోయి బురదమయంగా మారింది. రోజువారీ వెలువడే వ్యర్థాలను శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బంది లేరు. తుని పట్టణంతో పాటు రౌతులపూడి, తుని, కోటనందూరు, తొండంగి మండలాల నుంచి నిత్యం వందల మంది రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు ఇక్కడకు వస్తుంటారు. ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ వెలువడే వ్యర్థాల కోసం పశువులు గుమిగూడుతున్నాయి. మార్కెట్ యార్డు వ్యాపారుల నుంచి సెస్ వసూలు చేస్తున్నారు. ఆదాయం వస్తున్నా రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డులోని రైతు బజారులో వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపాలిటీ నుంచి సిబ్బందిని పంపేవారు. ఇప్పుడు ఎవరూ రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. క్షీణిస్తున్న పారిశుధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యర్థాలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం


తోట నరసింహాన్ని సత్కరిస్తున్న కరుటూరి శ్రీనివాస్ తదితరులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండలం నగరం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీనివాస్ కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు పార్టీ నాయకులతో కలిసి బుధవారం శ్రీనివాస్ వీరవరంలోని తోట నరసింహం నివాసంలో ఆయనను, యువ నాయకుడు తోట రాంజీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా వేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చేసిన మేలును ప్రజలకు వివరించాలని నిర్దేశించారు.

31న ఆదివాసీ సంఘ రాష్ట్ర కన్వెన్షన్


గోవిందపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘ రాష్ట్ర కన్వెన్షన్ ఈ నెల 31న ఉదయం పది గంటలకు అనకాపల్లిలో నిర్వహిస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేతలు వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని గోవిందపురం గ్రామంలో పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోను, దేశంలోను ఆదివాసీలు జీవన మనుగడ కోసం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న రాజ్యాంగ, చట్టబద్ధ హక్కులను పాలక వర్గాలు హరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఐటీడీఏ సేవలు గిరిజనులకు అందటం లేదన్నారు. సంఘ రాష్ట్ర కన్వెన్షన్‌లో గిరిజన సమస్యలపై చర్చిస్తారని, జూన్ 8, 9 తేదీల్లో జార్ఖండ్‌లో జరిగే ఆదివాసీ సంఘర్ష మోర్చా జాతీయ మహాసభలకు రాష్ట్రం నుంచి ప్రతినిధులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ మెంబర్ జక్కంపూడి రాజు, గిరిజన సంఘం నేతలు నాగులాపల్లి అచ్చారావు, రొబ్బల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశీయ సంస్కృతిలో భాగం యోగా

ప్రత్తిపాడు: భారతీయ సంస్కృతిలో సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మంటపంలో యోగాపై శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, నెల రోజుల పాటు వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రాణాయామ, సూర్య నమస్కారం, మెడిటేషన్, సోలో యోగాసనాలపై యోగా ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, ఎంఈఓ వి.రాజబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దినచర్య కావాలి

కిర్లంపూడి: ప్రస్తుత ఆహారపు అలవాట్లతో సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఓ దినచర్య కావాలని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ అన్నారు. స్థానిక సత్యదేవా కల్యాణ మండపంలో రెండో రోజు యోగాంధ్ర కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలకు ట్రైనర్లు బి.లక్ష్మీనారాయణ్, పి.అమృత, ఎస్.పద్మరాజు, ఎస్ వెంకటరమణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, యోగాతో పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆయుష్ అధికారి జె.మాధురి, డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణల్లో ఇంటర్నేషనల్ యోగా డే ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులకు పీడీ, పీఈటీలు యోగాలో శిక్షణ ఇచ్చినట్టు ఎంపీడీఓ ఎం.గోవిందు తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, మాజీ జెడ్పీటీసీ కాలూరి బోసుబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత

తుని: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బాలాజీ సెంటర్ వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే ప్రజలు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కమిషనర్ అన్నారు. పలువురు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

తొండంగి: నిత్యం యోగాసనాల ద్వారా దైనందిన జీవితంలో ఒత్తిడి నుంచి ఉపశమనంతో పాటు, సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యంతో జీవించవచ్చని తహసీల్దార్ మురార్జీ, ఎంపీడీవో బి.రాజేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు. అనారోగ్య సమస్యలనూ యోగా ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. నిత్యం కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐకేపీ, విద్య, వైద్యారోగ్య, ఐసీడీఎస్, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జగ్గంపేటలో యోగాసనాలు వేస్తున్న మండల అధికారులు, ఉద్యోగులు

ప్రతి రోజూ యోగా

జగ్గంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు నిత్యం యోగా చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జగ్గంపేటలో అధికారులు, సిబ్బంది ర్యాలీతో పాటు, స్థానిక మెయిన్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, ఆరోగ్యకర జీవనానికి యోగా మంచి మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, ఎంఈఓ ఆర్.స్వామి, డిప్యూటీ ఎంపీడీఓ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.


గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


తొండంగి మండల పరిషత్ కార్యాలయంలో..


కిర్లంపూడిలో యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది


ప్రత్తిపాడులో యోగా చేస్తున్న జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ తదితరులు